# ఓటమి

మధురాంతకం రాజారాం

వేటలో నిపుణులైన భటులు కొందరు వెన్నంటిరాగా భోజరాజు మృగయా వినోదంకోసం ధారానగరానికి రెండు ఆమడల దూరంలో గల అరణ్యానికి బయల్దేరాడు. ఆస్థానకవీంద్రుడు కాళిదాసుకూడా రాజుగారిని వెంబడించాడు.

మిట్టమధ్యాహ్నమైంది. భోజరాజు కవితోబాటు ఒక మర్రిచెట్టు నీడలోకూర్చుని సేద తీర్చుకుంటూ మెల్లగా సంభాషణకు వుపక్రమించాడు. భటులు దూరంగా ఎక్కడో వంటలు చేసుకుంటున్నారు.

ఇంతలో కూతవేటుదూరంలో వున్న చెట్లమాటునుంచీ ఒక పులి గాండ్రించడం అక్కడికి భయంకరంగా వినిపించింది. భోజరాజు ఖడ్గహస్తుడై లేచి నిలబడి "పులివేట ప్రత్యక్షంగా చూడాలన్న కుతూహలమూ, చూడ్డానికి కావలిసిన ధైర్యమూ వున్నట్టయితే మీరూ నాతో రావచ్చు" అని కాళిదాసుతో నుడువుతూ, పులి అరపు వినవచ్చినవైపుకు వేగంగా నడవసాగేడు.

పిరికివాడనిపించుకుని రాజుగారి ఎదుట కించపడడాని కిష్టంలేక కాళిదాసు ఆయనను అనుసరించాడు. ఏపుగా పెరిగిన మద్దిమ్రానులమధ్య ఒక చిన్న సెలయేరు ప్రవహిస్తోంది. ఆయేటిప్రక్కన చల్లటినీడలో పడుకుని పులి ఆవలిస్తోంది.

"పృథ్వీపతీ! అదిగో పులి" అన్నాడు కాళిదాసు.

"మీరు యిక్కడేవుండి చూస్తూ వుండండి" అంటూ భోజరాజు వెనుకనుంచీ పులిని సమీపించాడు. తొందరగా నడవడంలో ఎండుటాకులు గలగలమన్నాయ్. పులి వులికిపడిలేచి అటూ, యిటూ చూచింది. రాజు ఒక్క అంజతో ముందుకు దూకి పులిపైకి కత్తి విసిరాడు. కాని పులి వెంట్రుకవాసిలో దెబ్బ తప్పించుకుని సెలయేరు దాటి ఆవలివైపు కీకారణ్యంలోకి కాలికొద్దీ పరుగెత్తసాగింది. దాని వెనువెంట రాజు, ఆయన వెంబడి కాళిదాసు పరుగెత్తసాగారు.

అలా ఎంతదూరం పరుగెత్తారో వాళ్లకు తెలియదు. తీక్ష్ణంగావుండిన సూర్యకిరణాలు క్రమక్రమంగా చల్లబడి పోయాయి. శరవేగంతో పరుగులిస్తూ పెద్దపులి ఏ పొదల చాటునో కనుమరుగై పోయింది. ఆయాసంతో రాజు, కవీ ఒక బండపైన కూచున్నారు.

తేరుకున్నతర్వాత కాళిదాసు రాజువైపు తిరిగి "ప్రొద్దు వాటారిపోయింది ధరణీపతీ! ఈ రాత్రికి మనం ఈ అరణ్యంలోనే వుండిపోవడం దేవరవారికి అభిమతం కాదుగదా!" అన్నాడు.

"లేదు లేదు. మనకోసం భటులు ఎదురు చూస్తుంటారు. వెళ్దాం పదండి" అంటూ రాజు పైకి లేచాడు. ఇద్దరూ నడవసాగారు.

కాని ఎంతదూరం నడచినా వాళ్లు బయల్దేరినచోటు చేరుకోలేక పోయారు. తనపని తీరిపోయినట్టు సూర్యుడస్తమించాడు. దారితెన్నూ లేని అరణ్యంలో దారి తప్పిన భోజరాజు దిక్కులు తోచక కాళిదాసును చూస్తూ "ఇక మనం నడచి ప్రయోజనంలేదు. ఇక్కడికి ధారానగరం ఏవైపున వున్నదని కూడా నేను వూహించుకోలేక పోతున్నాను" అన్నాడు.

"ఐనా మరి కొంతదూరం నడుద్దాం అవనీపతీ! అప్పటికి చంద్రోదయం కూడా అవుతుంది" అన్నాడు కాళిదాసు.

మళ్ళీ ప్రయాణం కొనసాగింది. అటు చంద్రుడు వుదయించడమేమిటి, యిటు రాజుగారికి, కవిగారికి ఒక కాలిబాట కనిపించడమేమిటి ఒక్కసారే జరిగాయి.

"ఈ బాట మనల్ని ధారానగరానికి కాకపోయినా ఒక చిన్న కుగ్రామానికైనా తీసుక వెళ్ళదా మహారాజా" అన్నాడు కాళిదాసు.

అందుకు సందేహ మేమిటి? మనం దుర్గమారణ్యాన్ని దాటి, అడవి పొలిమేరలో నడుస్తున్నాం ఇంకొక్క అర్ధక్రోసు దూరంలో మనకు ఆశ్రయం దొరకవచ్చు" అన్నాడు భోజరాజు

రాజుగారి అంచనా నిజమైంది చంద్రబింబం నాలుగు బారలు ప్రొద్దెక్కే సరికి రాజూ, కవీ కాలిబాట ప్రక్కన ఒక గుట్ట చెంత వున్న చిన్న పూరి గుడిసె ముందు నిలబడి మెల్లగా తలుపుతట్టారు

"ఎవరు వారు" అంటూ ఒక ముసలావిడ తలుపు తెరిచింది

"ఎవరైతేనేంలే అవ్వా! దారి తప్పిన బాటసారులం ఈ బాట ఎక్కడికి పోతుందో చెప్పగలవా నువ్వు" అన్నాడు కాళిదాసు

ముసలావిడ ఏమీ అర్థంకానట్టు కాళిదాసు కేసి విచిత్రంగాచూస్తూ "బాట ఎక్కడికి పోతుంది బాబూ! దానికేం కాళ్లున్నాయా ఒకచోట నుంచీ మరొకచోటకు నడవడానికి. అదెక్కడికీ పోదు. మనుషులు మాత్రం దానిపైన రాకపోకలు సాగిస్తుంటారు. అదలావుండని! మీ రెక్కడినుంచీ వస్తున్నారు?" అంది.

"మేము యాత్రికులం అవ్వా! కాశీక్షేత్రంనుంచీ వస్తున్నాం" అన్నాడు కాళిదాసు

"మీరు యాత్రికులా' పరాచికాలాడడానికి మీకీ ముసలిది దొరికిందా బాబూ! లోకంలో సూర్యచంద్రులిద్దరుమాత్రమేకదా యాత్రికులు! మిగిలినవాళ్లు యాత్రికులంటే నేను నమ్మను" అంది వృద్ధురాలు.

ఈసారి మహాకవి కొంచెం తీవ్రంగా ఆలోచించి "మేము అనిత్యమైన జీవితంగల మానవులం అవ్వా" అన్నాడు

"ప్రపంచంలో అనిత్యమైనవి రెండే రెండు ఒకటి యౌవనం, రెండోది సంపద వాటితో పోల్చి చూచినప్పుడు జీవితం అనిత్యం కాదే!" అంది ముసలావిడ

భోజరాజుకు చిరాకు కలిగింది అతడు కొంచెం కటువుగా

**వజ్రపాణి**

కోటయ్య సెట్టిగారింట
కోట్ల కొలదిగ ధనము కలదు,
వెండి బంగారములు కలవు,
దండిగా భూవసతి కలదు

కోటయ్యభార్య కాటమ్మ,
కాటమ్మ యుక్తిపరురాలు!
వారి సంపద దొంగిలింప
చోరు డొక్కడు తలచుచుండె!

ఒక్కనాడా దొంగవాడు
చక్కగా యింటిలో దూరి,
అటకపై దాగియున్నాడు!
అది గ్రహించినది కాటమ్మ!

ఓటిదగు నొక బిందెయందు
కాటమ్మ రాళ్ళు నింపినది!
బిందె మూతికి కట్టుకట్టి
ప్రియభర్తకై యెదుచూచె?

బాగుగా రాత్రియగు పిదప
వచ్చెనింటికి సెట్టిగారు,
ఆరగించుచు బిందె చూచి
"అక్లీల కట్టితివి?" అనెను.

అటకపై నున్నట్టి దొంగ
ఆలకించెడి విధముగాను
అతని సతి చెప్పినది "బిందె
యందు ధనమును నింపినాను!

మన దొడ్డిలో నూతియందు
మఱి కొంచెము నీరులేదు!
దానిలో ఈ బిందె దాచు
చో, నిర్భయముకదా! మనకు"

ఆ భారమయినట్టి బిందె
అతి కష్టమున మోసినారు—
వారు నూతిని చేరులోన
చోరుడును వెలుపలకు వచ్చె!

ఆ తన్వియును, సెట్టిగారు
నూతిలో బిందె పడవైచి,
తిరిగి తమ గది చేరినారు—
మఱి దొంగవాడు గమనించె

"నూతిలో నీరు లేదనుచు
ఆ తన్వి చెప్పినది కాదా?
ఆలస్య మింకేల?" అనుచు
అతడు కూపము తొంగిచూచె

అపుడు చీకటి రాత్రి కనుక
అందు కానరాదాయె జలము!
నీరు లేదని యెంచినట్టి
చోరుడందున దుమికి మునిగె!!

★ ఓటమి ★

"చూస్తుంటే తెలియడంలేదా అవ్వా! మేము రాజులం!" అన్నాడు.

"రాజులా నాయనా! బాగా చెప్పావు అప్పటికి నేనంత మతిలేని దాన్ననా నీ అభిప్రాయం లోకంలో రాజులిద్దరే ఒకడు నెలరాజు, ఇంకొకడు ధర్మరాజు. ఐనా నాతో మీకీ కుతర్కాలెందుకు? వాస్తవంగా మీ రెవరో ఒక్కమాటతో చెబుతే సరిపోదా" అంది వృద్ధురాలు.

భోజరాజు కీసారి కోపమే వచ్చింది. అతడు రెండడుగులు ముందువేసి "మహాతల్లీ! మేము ఓర్పు అన్న భూషణం ధరించిన వాళ్లం కాబట్టి సరిపోయింది. లేకుంటే నీకీపాటికి ఎలాటిదుర్గతి పట్టివుండేదో కదా" అన్నాడు.

"అదేమిటి బాబూ! ఓరిమిని అలంకారంగా గలిగిన వాళ్ళలో ఒకతె భూదేవి, మరొకతె మానవాంగన. దుస్తులు బట్టి చూస్తే మీకూ పైవాళ్ళకూ పోలికలేవీ కనబడడం లేదే" అని విస్మయం ప్రకటించింది ముసలావిడ.

"మమ్మల్ని విసిగించకమ్మా తల్లీ! తిరిగి తిరిగీ అలసిపోయాం. వాస్తవానికి మేము పరదేశస్థులం" అన్నాడు కాళిదాసు

"పరదేశస్థులా నాయనా మీరు! ఏంమాట! ఒకటి పుట్టనైనాపుట్టాలి లేకుంటే చావనైనా చావాలి. అప్పుడు గానీ పరదేశానికి వెళ్లడం సాధ్యపడదు. పుట్టడమంటే పరదేశానికి రావడం. చావడమంటే పరదేశానికి పోవడం"

రాజు కవిగారి ముఖం చూచాడు. కవి రాజుగారి ముఖం చూచాడు "ఓడిపోయాం, ఓడిపోయాం" అన్న భావం ఆ చూపుల్లో వ్యక్తమైంది ఇక ఓటమిని అంగీకరించడమే సమంజస మనుకున్న కాళిదాసు "అవ్వా! ఇంకా వెయ్యిమాటలెందుకు? నీ దగ్గర మేము ఓడిపోయాం" అన్నాడు

"అదేమిటి బాబూ' లోకంలో ఓడిపోయే వాళ్లిద్దరు ఒకడు అప్పు తీసుకున్న వాడు' మరొకడు ఆడుబిడ్డను కన్నతండ్రి. వాళ్ళకు తప్ప మరెవ్వరికీ ప్రపంచంలో ఓటమి లేదే" అంది ముసలావిడ.

సిగ్గుతో మహాకవి తలవంచుకున్నాడు భోజరాజు ముఖం వెలవెల బోయింది. వాళ్ళను చూచి ముసలావిడ నవ్వుతూ "ఎంత గడుసరివాళ్లు బాబూ మీరు! మీ రెవరో నాకు తెలియ దనుకుంటున్నారు గదూ! పాఅబాటు ఈ రాజ్యంలో మిమ్మల్ని తెలియనివాళ్లెవరు? వేటకు వెళ్ళి అరణ్యంలో దారి తప్పినట్టున్నారు. ఇటే వెళ్లండి. ఇదే ధారానగరానికి దారి" అంది. ★

(ఒక కన్నడ కథ ఆధారం)

